# ఆంబోదల గిడ్డడు

నేను రైల్వేలో ఉద్యోగం ఎలగబెడ్తా ఉణ్ణెప్పుడు నాది పిల్లి కాపరం!

పిల్లి దాని జల్మంతో ఒక కొంపలో కుదురుంగా కుప్పకొట్టదే. ఆ కొంపలో కొన్నాళ్లు... ఈ కొంపలో రొన్నాళ్లు... అన్నీ సక్కరంగా అవిరి పొణుకుండేదానికి ఒక పొయ్యి దొరికిందంటే ఆడొక మూన్నాళ్లు-

నా బతుకు కూడా ఆటేసిన్లో రొన్నాళ్లు ఈటేసిన్లో మూన్నాళ్లుగా జరిగె. ఎవుడు యాడ లీవు పెడ్తే ఆడికిపో అంటే పొయ్యేది. వాడు వచ్చేదాకా వాడి బొదులుగా పనిచేసేది. వాడు వచ్చేస్తానే ఆణ్ణుంచి అట్నే యింకొక టేసిన్‌కి చలో అంటే ఎలబారి పోతా ఉండేది.

అయితే పిల్లికాపరానికి నా కాపరానికి వొగిటే వెత్తాసం!

పిల్లి యిట్ట పుట్టే పొద్దు అట్ట పుట్నా వొంటిగా అడుగెత్తి బయిట పెట్టదు. పిల్లల్తో కూడానే మకాం మారిస్తింది. నా కత అట్టాకాక పాయనే. బొమ్మట్టా పెండ్లాం ఉంటేగూడా బెమ్మశారనే. పొండట్టా పిలకాయిలుండిగూడా గొడ్డుబోతు యదవనే. నా చెయ్యి నేను కాల్చుకుంటా బతికినోణ్ణి.

ఇప్పుడుగానా తల్సుకుంటే మనమేనా యిట్టా బతుకు బతికిందని నాకే నరెంటికి పడ్తింది. లేకుండాపోతే అదీ ఒక బతుకేనా? చెప్పుకుంటే సిగ్గుచేటు. పేరేమో చిన్న మాస్టర్. ఏసుకుండేదేమో కోటూ తలమింద హేటూ. అవి తీసేస్తానే ఆ అడివి కొంపల్లో మసిబొకుల తో ఫైటూ!

అట్టా గాకుండా పోతే కడుపులో పేగుల కత చెప్పేదానికి అలివి మాల్దే!

ఒక చెక్క పెట్టె. ఆ పెట్టెలో అంత ఉప్పు. అంత పప్పు... రొంత చింతపాండు... రొన్ని బియ్యం... ఒక స్టౌ... రొండు మూడు బోకులు పెట్టుకుండేది. శెట్టిగుంట... బాలపల్లి... మామండూరు... కనమలోపల్లి ఇట్టా మాదిరి ఊళ్లల్లో ఆ స్టౌ మింద యాళ కంత కూడు వండుకునేది. అర్సే పేగుల్ను ఎట్నో ఒకట్టా యామార్చేది.

ఇట్టా మాదిరి టేసిన్ టేసిన్ తిరగతా ఉణ్ణేదినాల్లో కలికిరి రైల్‌టేసిన్లో వారందినాలు పని చెయ్యాల్సి వచ్చె. చేస్తా ఉండా!

ఆపొద్దు ఆవులేళ అయ్యుంటిందేమో? దిగబడి పొయ్యే బండి పొయ్‌నాక ఎగబడి వచ్చే బండి కోసరం ఎదుర్సూస్తా ఉండా! ఉణ్ణెట్టుండి ఆ ప్లాట్‌పారం మింద జనం అద్దో ఆంబోదలగిడ్డడు!... అద్దో ఆంబోదలగిడ్డడు! అంటా పరిగిత్తతా ఉండారు. ఆంబోదల గిడ్డడి మాట చెవల్లో పడేకుందికి నేను గూడా లేసి పరిగిత్తాలనుకుణ్ణా. అయినా నేను ఏసుకోనుండే కోటు... పెట్టుకోనుండే హేటూ... తొడుక్కోనుండే బూడ్సులూ... అడ్డం పడే కుందికి అడుగు ముందుకు ఎయ్‌లేకుండా అట్నే కూలబడ్తి. మణుసు మాత్రం ఆంబోదలగిడ్డడి ఎంటపడె.

అప్పుడు నేను తిరపతిలో దేవస్తానం అయిస్కూల్లో ఎనిమిదో తరగతి చదువు కుంటా ఉండా. ఆ రోజుల్లోనే ఆంబోదలగిడ్డణ్ణి చూసేదానికి పావలా టిక్కట్టు పెట్టిరి. ఆ నాలుగణాల దుడ్లిచ్చేదానికి మా మునెమ్మక్క నన్నెంత రాసి రంపాన పెట్టె?

''వాడూ వొక మణిసే గదా? వాడికేమన్నా రావణాసురుడి మాదిర్తో పది తలకాయి లుండాయా? వాణ్ణేంది పొయ్ చూసేది? ఆ పావలా దుడ్లుంటే వొకపూట మార్కట్టు సెలవకన్నా అవితింది. ఈ మిడిమాళం పట్నె పిలగాడితో పెద్ద రంపై పాయనే?'' అంటా పెద్ద రంపు చేసె.

అయినా నేను యిడ్సిపెట్నానా? లేదె? పోనీ! ఎట్టా యిడ్సి పెట్టమంటారు? మా కమలాపాండు చినయ్య మిద్దార్లో యింటి ముందర తిన్నెల మింద కూసో పెట్టుకోని సావకాశింగా చదువు చెప్పినట్టు ఆంబోదలగిడ్డడి కత లెన్ని చెప్పె. అటుమంటోడే ఊళ్లో కొచ్చినాడంటే పెద్దపులి ఊళ్లోకొచ్చినట్టేగదా? అచ్చుపుస్తకాల్లో పులి బొమ్మను చూసేదానికి అచ్చంగా పులిని చూసేదానికి వెత్తాసం లేదంటారా? చూడకుండా పోతే అదీ ఒక జల్మమేనా? అని అన్నం తినకుండా అలిగి కొంపలు మునిగిపోతా ఉణ్ణెట్టు ఏడ్సి... నాలుగణాలు సమాళించుకుణ్ణా. ఆ దుడ్లు యిచ్చేసి నలుగుర్తో నారాయణా అన్నెట్టుగా ఆ పొద్దు అంబోదల గిడ్డణ్ణి చూసినా.

మొంటె అంత మొకం. పెద్ద గుమ్మిడి కాయంత తలగుడ్డ. మణిసి కుదేసినట్టు గుమ్మటంగా ఉంటాడు. కుర్సీ నిండికి కూసోని ''ఈళ్లతో నాకేం పని?'' అన్నెట్టుగా ఎట్నో చూస్తా ఉండాడు.

మా కమలాపాండు చినయ్య చెప్పిన కతలన్నీ తల్సుకుంటా ఒక్క నిమిశం సేపు

వాడి ముందర నిలబడే కుందికి వొళ్లట్నె జిలపరించె. 'ఈ కతలన్నీ నిజిమేనా?' అని నిల్దీసి అడగాలనిపించె. అయినా నోరాళ్లా. నీళ్ల నమల్తా నిలబడుకోనుంటే ఎనకాలొచ్చేవాడు వచ్చి మిందబడె. నేను ముందుకు పోతి. నా మునాస ఎనిక్కిపాయ!

ఆ పొద్దుట్నుంచీ అంబోదల గిడ్డణ్ణి అడగాలనుకున్నె మాట మాటగానే మిగిలిపాయ. దినాలు గడిసె. వారాలు గడిసె. నెలలు గడిసె. సమ్మత్సరాలు గడిసె. అరా కొరవగా నా చదువు ముడిపడె. ఆ చదువుకే వద్దంటే గూడా ఒక ఉద్దోగం వచ్చెసె. ఉద్దోగం చేసుకుంటా ఊళ్ల తిరుక్కుంటా నా యిష్టం కిష్ణాపురం నారాజా రామాపురం అంటా నా జల్సాల్లో నేను వుంటే మా అయ్య మా యమ్మ బెండకాయ ముదిర్తే పనికి రాదని ముంగాళ్లకు బందం యేసేసిరి. ఆ బందంలో గూడ ఏందో ఒక అందం ఉండాదనుకుంటా ఉంటే మా బాశాలి ఏటా బాలింతరాలు అవతానే ఉండె!

ఇంకేముండాది? అయ్ పాయ. అంతా అయ్‌పాయ. ఏందో పొడ్సేయాల. గెల్సేయాల. అనుకుంటా ఉండిందంతా కొండెక్కి పాయ. నా పెండ్లాం... నా పిలకాయిలు... నా బతుకు... అంతానాది- నాదిగా బతుకులో పునాదులు పడె. అంబోదల గిడ్డణ్ణి మల్లా చూడాల. మాట్లాడాల అనుకుంటా ఉండిందంతా ఆ పునాదుల కింద పడి మట్టికొట్టక పాయ!

అటుమంటిది ఈ పొద్దు అంబోదలగిడ్డడు అగుపించినాడంటే నన్ను పట్టేదానికి పగ్గాలుంటాయా? ఎట్లయినా సరే. ఆ పొద్దు అంబోదలగిడ్డడికి వల ఎయ్యాలనుకున్నా. వల్లోపడ్తే చాల్దా. మల్లా ఎట్ల కావాలంటే అట్లా మలేసుకోవచ్చు. అందుకే పోర్టర్ని పిల్సినా.

''ఒరే అబ్బారే! బండి వొస్తే నేను గెంట కొట్టుకుంటా. లైన్ క్లియర్ నేను యిచ్చుకుంటా. నువ్వు చెయ్యాల్సిన పన్లన్నీ నేనే చేసుకుంటా. నువ్వుపో. ఏం చేస్తావో? ఏం చెప్తావో? నాకు తెల్దు. అంబోదలగిడ్డణ్ణి ఈడికి పట్టుకోనొచ్చే బారం నీది!''

నా మాట యింటానే వాడు యిడ్సి పెట్టిందే చాలన్నెట్లు తిరిగి మల్లి చూడకుండా పరిగిత్తె!

నేను వాళ్ల కోసరం ఎదురుచూస్తా కూసోని ఉండా. మీరు నిజిం చెప్పినా యింటారు. లేదు అపద్దం చెప్పినా యింటారు. ఎదురుచూస్తా ఉండానంటే అట్లా యిట్లా కాదు. వెయ్యికండ్లతో ఎదురు చూస్తా ఉండా.

అంబోదలగిడ్డడు గజదొంగ. అయితే గూడా వాడు ఎద కలిగినోడు. ఎదిటోడి ఎదను ఎతల్ను ఎరిగినోడు. అందుకే శానాసేపు నన్ను ఎతలు పెట్టకుండా వచ్చేసినాడు.

వాడు కంట పడేకుందికి కోటు కోపెట్టా పాయనో? తలమింద టోపి ఎట్టెట్ట పాయనో? నాడొలంతా డౌన్ అయిపాయ. నాకు తెలవకుండానే నేను ఎగిరి పడి లేస్తి.

''ఏమి రమ్మన్నావంట?... నువ్వు పిలిస్తే వచ్చేదానికి నేనేమన్నా నువ్వు పెట్నె మణిసి అనుకున్నావా?''

మోట బానలో నీళ్లు కుమ్మరిల్లి నట్టుండాది మాట!

''కొంచేపు మాట్లాడ్తామని...'' అంటా నసిగినా.

''ఏం మాట్లాడ్తావ్?''

''నేను మాట్లాడేదికాదు. నువ్వు మాట్లాడ్తే యిందామని!''

''మాట ఊరికే రమ్మంటే వస్తిందా?

''అయితే ఏం చేస్తే వస్తిందంటావ్?''

''మందేసుకుంటే మాటొస్తింది.''

మారు మాట్లాడకుండా అయిదు రూపాయిలెత్తి చేతికిచ్చినా. నాకల్లా ఆ అయిదు రూపాయిల నోటుకల్లా రొంచేపు మార్సి మార్సి చూసె. ఆ రోజుల్లో అయిదు రూపాయిలంటే చిన్న మొత్తం కాదు. అందుకేనేమో-

''ఏ ఊరు మీది?'' అని అడిగె.

''మిద్దూరు''

''మిద్దూరా! మిద్దూళ్లో ఎవురి పిలగాడివి?''

''పెదరామి రెడ్డి మనవణ్ణి!''

ఆ మాట చెవల్లో పడ్తానే రొండు చేతులెత్తి దణ్ణం పెడ్తా-

''అట్ల చెప్పరా మనవడా! అట్ల చెప్పు. పులి కడపున మేక పిల్ల పుట్టిందా? పెదరామిరెడ్డి అంటే ఏమనుకున్నావ్? కుడి చెయ్యి చచ్చుబడి పూడిస్తే పూడ్సింది. ఎడమ చెయ్యి వొగిటి చాల్దా? ఎక్కే గుర్రం చాల్దా? కట్ల గట్టి పాయి కట్టునంతా శాతపట్టుకో నుండె. గీసిన గీత దాటినోడు లే. దాటి బతికినోడూ లే. వస్తానుండ్రా మనవడా! వస్తా నుండు.'' అంటా నా మాట కోసరం ఎదురు చూడకుండా ఎలబారిపాయ.

నాకైతే ఎనిగి మిందికెక్కినంత సంతోసంగా ఉండాది. అంతలోనే ఎగబడి దర్మవరం పొయ్యేబండి వచ్చె. అది కొందుర్ని దించేసె. కొందుర్ని ఎక్కించుకుండె. దాని దోవన అదిపాయ. దిగబడి పొయ్యేబండి యింకెప్పుడో పైటేళ కాడ రాబొయ్యేది. ఆ యరవదాకా ఆటేసిన్లో యింకేం పనీ పాటా లే. నడిమిద్దె ఎప్పుడైన వొగిటీ అర గూడ్సు బండ్లు వస్తే వస్తాయి. లేక పోతే అదీలే. పొద్దుగూకులూ పనీ పాటా లేకుండా గోళ్లు గిల్లుకుంటా కూసోనుండాలంటే బలే యాసిరిగ్గా ఉండేది. అటుమంటిది ఆ పూట శానాకుశాలగా ఉండా.

నా కుశాలమింద నేనుంటే తన ఉసారు మింద తానుగా అంబోదలగిడ్డడొచ్చె. మణిసి ఊగతా వుంటే దొడ్డి కాళ్లు పళ్లేకుండా ముందుకు పడ్తా ఉండాయి.

''ఒరే మనవడా! మాట తప్పడమనేది ఈ గిడ్డడి యింటా వొంటా కూడా లేదురా.

వస్తానంటి వచ్చేస్తి. పెదరామిరెడ్డి అంటే ఎవురు? నాకు గురువు. నా గురువుకు మనవడైనా నాకు మనవడైనా వొగిటే కదా? అడగరా అడుగు. ఏం కావాల్నో అడుగు.'' అంటా చంకలో మూట తీసి టేబుల్ మింద పెట్టి నాకు ఎదురుంగా కుర్చీలో కూసుండె.

''మూట మింద మణిసి మింద యింత గురి ఉండేటోడివి! – దొంగతనాలు ఎట్లా చేసినావు?''

''ఉండేవాణ్ణి కొట్నా. లేనోడికి పెట్నా. ఏం తప్పా?''

ఆ మాటంటా గిడ్డడు చూసిన చూపు చూపా అది? వొరనుండి తీసిన బాకేగదా!

బొదులు ఏమని చెప్పాల? ఆ మాట కొస్తే ఉండేవాడు లేనోడని యిరు తెగలు ఉండ గూడదని కదా ఈ పొద్దు శానా మంది అన్నలు పోరకలాడ్తా ఉండారు. ఈళ్ల దొమ్మి కట్నారు. గిడ్డడు ఒకడే పూనుకున్నాడు. ఇట్లా మాదిరి ఆలోసించుకుంటా ఉంటే–

''ఒరే పిచ్చోడా! సడీ చప్పుడు లేకుండా ఎవుడికీ తెలవకుండా చేస్తే అదిరా దొంగతనం. పలానా దినం పలానా యాళకాడ పలానా చోట దోస్తావుండా. మూతి మింద మీసం వుండే మొగోడెవుడైనా సరే! శాతైతే పట్టుకోవచ్చుని చెప్పే గదా చేస్తావుంటి.''

''అదెట్లా సాద్దె పడిందబ్బా?''

''ఏం? నీకు నేర్సుకుందామని ఉండాదా?''

''రామ రామ! నాకెందుకు గానీ . యిందామని కుశాలగా వుంటే...''

''ఏమి యింటావురా మనవడా? ఎన్ని యింటావురా! ఒకసారి కంచికి పొయ్‌నా. అట్లా యిట్లా చూసి ఒక గుడిమిందికెక్కినా. ఎల్తిరి కట్టుకుండే అద్దాన్ని పగలకొట్నా. గుళ్లోకి దూకేసినా. రాతికి చక్కలిగిల్లి పెట్నెట్టు ఒక రాతికి నగలు అలంకారం చేసుండారు. అన్నీ వొల్సుకుణ్ణా. నడుముకు కట్టుకుణ్ణా. ఒళ్లంతా నామాలు పెట్టుకుణ్ణా. 'గోయిందా! గోయిందా!' అని అర్సేదానికి మొదులు పెట్నా. సగం రేత్రికాడ గోయిందనామ స్మరణ! అది గూడా గుళ్లో యిచ్చిత్ర మనిపించి తలుపులు తీసిరి.

నేను రొండు చేతులు పైకెత్తితి. కండ్లు మూసుకుంటి. గోయిందా! గోయిందా! అంటా ఎలబార్తి. పాపం! అయ్యోర్లు. వంగొంగి దండాలు పెట్తా ఎంట పడిరి. అట్నే గుడి ముందిరి దాకా వచ్చినా. ఆడి కొచ్చినాక 'నేను అంబోదలగిడ్డణ్ణిరే!' అంటే పరిగిత్తినా'' అంటా పడి పడి నవ్వతా ఉండాడు.

''అయితే పోలీసోళ్లు...''

''హుఁ! నన్ను పట్టేదానికి వాళ్లకు శాతయ్యుంటే ఈ పొద్దు నాకు పించను ఎందుకిస్తార్రా నా ఎర్రి మనవడా? దొరక్కుండానే ఉంటే నన్నెత్తక పొయ్ వేలూరి జైల్లో యేసిరి. సరే ననుకుంటి. పారా తిరిగే వాళ్లు తిరగతానే ఉండారు. బల్లుమని తెల్లారేకాడికి నేను నరాల పేట కనంలో తేల్నా. మూసి పెట్నె గంప మూసి పెట్నెట్టే ఉండాది. కోడి ఎట్లా పొయ్యిందో పొయ్యింది. ఇట్లాంటివి ఎన్నని చెప్పమంటావురా మనవడా?''

''కనికట్టు యిద్దేమన్నా నేర్సు కుణ్ణావా?''

''అది శానా కతలేరా అబ్బోడా. చెప్పాలంటే శానా కర్సు అవితింది. నువ్వు దొంగతనం చెయ్‌బాక. పించనిస్తాం. అంటే వొప్పుకుంటి. పిలకాయిల చదువు మంచీ చెడ్డా అంతా వాళ్లే చూసుకుంటా ఉండారు. చిత్తూర్లో నేనా గిరింపేటకు పాయ్ కనిపిస్తా ఉంటే చాలు!'

''ఇంత శాతుర్యం ఉన్నోడివి. వాళ్ల చేతికి ఎట్టా దొరికి పోతివి?''

''వాడుండ్లా నచ్చుకూర్లో కర్నమోడు. రామసెంద్ర పిళ్ల. మీ కన్నెయ్య చిన్నయ్య వాళ్లింట్లో సంకటి సలిబిండి తిని బతికినోడు. కర్నం బిడ్డ గదా? శానాపలాతన్ నాయాలు. నేనొక లంజ ముండను పెట్టుకోనుంటి. దాన్ని పట్టుకుండె. అది మంచి మంచిగానే నాకు ముక్కలదాకా తాగిపించె. నేను వొళ్లు తెలవకుండా పడుంటే వాడొచ్చి అదుంకుండె. నాచేతి కూడు తిని అది నన్నే పట్టిచ్చె. ఆడది గదా?''

ఆ మాటంటా ఉంటే గిడ్డడి కండ్లల్లో గిర్రని నీళ్లు తిరిగె!

*లంజ మాట మాటేగాదు*
*వఙ్ఞ మూట మూటే గాదు*
*లంజ మాట యిన్నోడికి*
*కుండా కుదురూ రొండూ లేవు!*

అని పాడుకుంటా లేచి చక్కా పాయ!

ముప్పై ఏండ్లయిపాయ. ఇప్పుటికీ గిడ్డడు నాకండ్లల్లో మెదల్తానే ఉండాడు. కలీకిరి ప్లాట్ పారం మింద మహా యాదాంతి మాదిర వాడు పాడిన పాట చెవల్లో గింగురు మంటానే ఉండాది!

మొన్న ఒకనాడు నాలుగ్గాళ్లమండపం కాడ ముత్తారెడ్డన్న ఈ కతంతాయిని–

''ఒరే అబ్బోడా! అంబోదలగిడ్డడు దోచుకుణ్ణిందంతా దాచుకోనుంటే వాడొక దొర. దాచు కోకుండా నలగరికీ పెట్టె గదా? అందుకే వాడొక దొంగ! ఈలోకంలో దోచుకో గలిగినోళ్లంతా దొరలేరా!'' అనె.

అంతే గదా మరి? – లోకం నోకవే అంత! ●